క్లుప్తంగా

9న భీమేశ్వరస్వామి దేవాలయం షాపుల వేలం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానంకు చెందిన షాపులు వేలాన్ని ఈనెల 9న నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.శ్రీకాంత్ తెలిపారు. షాపులు జూలై 1 నుంచి మే నెలాఖరు వరకు అనగా రెండేళ్ల పాటు కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య సేవలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన నిరుపేదలకు ఉచిత వైద్య సేవలతో పాటు ఉచిత మందుల పంపిణీ చేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని కార్యాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య సేవలు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సంస్థ ఆదేశాలను అనుసరించి ఉచిత వైద్యసేవల టార్గెట్ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బోనకల్లు మండలం చొప్పకట్లపాలెంలో కూడా వైద్యసేవలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సంస్థ వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యదర్శి గుదిమళ్ల సూర్యప్రకాశరావు, డాక్టర్ శ్రీహరినాథబాబు, రవికుమార్, ఉప్పలయ్య, సాయికుమార్ పాల్గొన్నారు.

బస్టాండ్ పునఃప్రారంభం


బస్టాండ్‌లోకి వస్తున్న బస్సు

నేలకొండపల్లి: ప్రయాణికుల సౌకర్యార్థం నేలకొండపల్లిలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ శుక్రవారం ఎట్టకేలకు పునఃప్రారంభమైంది. వివిధ కారణాలతో బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో బస్సులు బస్టాండ్‌లోకి రాకుండా పోయాయి. దీంతో గత కొంతకాలంగా స్థానికులు సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్, మారిశెట్టి వెంకటేశ్వరరావులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఆర్టీసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. ఎట్టకేలకు బస్టాండ్ ప్రాంగణమంతా జేసీబీతో శుభ్రపరిచి పునఃప్రారంభించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, బస్టాండ్‌లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కూసుమంచి: మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన యువత మేలుకో ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను ప్రారంభించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శీలం రామకృష్ణ మాట్లాడుతూ.. ఇంగ్లిష్ ప్రాధాన్యతను గుర్తించి వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్చుకునేందుకు ఈ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఎలుకల మందు తాగి ఓ యువకుడు ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని బైరవునిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పిడి రమేష్ శుక్రవారం ఇంట్లో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నగరంలో సినిమాలు

తిరుమల	బాపూ
వినోద	టిల్లు2
సాయిరాం	ప్రసన్న వదనం
ఆదిత్య	శబరి
శ్రీనివాస	ఆ.. ఒక్కటీ అడక్కు

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	24	పాలకూర	2
పచ్చిమిర్చి	48		10
కాకర	44	చుక్కకూర	2
బీర	46		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	70	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	46		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	56		20

-ఖమ్మం వ్యవసాయం

పెడచెవిన పెడితే పెను ప్రమాదం


చెరువుమాధారంలో కాలిన వ్యవసాయ మోటార్లు


మోటాపురంలో రోడ్డు వెంట తగలబడుతున్న చెట్లు

- పంట పొలాల్లో వరి కొయ్యలకు నిప్పు
- కొన్నిచోట్ల రైతులు, ఇంకొన్ని చోట్ల ఆకతాయిలు
- ఫలితంగా అగ్నిప్రమాదాలకు ఆస్కారం

నేలకొండపల్లి: యాసంగిలో వరి సాగు చేసిన రైతులు పంట కోశాక మిగిలిన కొయ్య కాలికి నిప్పు పెట్టడం వల్ల భూసారం ముప్పు ఏర్పడుతోంది. అంతేకాక అగ్నిప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఈ మేరకు కొయ్యకాళ్లను భూమిలోనే కలియదున్నాలని వ్యవసాయ అధికారులు చెప్పినా చాలామంది పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్ల రైతులే వరి కొయ్యలకు నిప్పు పెడుతుండగా.. మరికొన్ని చోట్ల చోట్ల ఆకతాయిలు ఈ చర్యకు పాల్పడుతున్నారు. ఫలితంగా ఎండ వేడి, వడగాలులకు మంటలు ఎగిసిపడి సమీపంలోని తోటలు, పచ్చని చెట్లు కాలి బూడిదవుతున్నాయి.

వరుస ఘటనలతో బెంబేలు..

పాలేరు నియోజకవర్గంలో వారం రోజుల వ్యవధిలోనే అనేక అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఇందులో కొయ్య కాలికి నిప్పు పెట్టటంతో జరిగేవి ఎక్కువగా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరు వద్ద సబ్‌స్టేషన్ వద్ద మంటలు చెలరేగాయి. అలాగే, చెరువుమాధారం శివారులో దాదాపు 50 ఎకరాల వరి పొలాల్లో చెత్త తగలబడింది. ఇదేఘటనలో రైతులకు చెందిన ఆరు వ్యవసాయ మోటార్లు కాలిపోయాయి. తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాలలో అనేక అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఈ విషయంలో రైతులు కూడా ఆలోచించి వరి కొయ్య కాలికి నిప్పు పెట్టకుండా భూమిలో కలియదున్నితే మంచి ఫలితాలు వస్తాయి. ఇక ఇలాంటి ఘటనలకు పాల్పడే ఆకతాయిలను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పంట అవశేషాలను తగలబెట్టొద్దు..



రైతులు పంట అవశేషాలు తగలబెట్టడం సరికాదు. దీని వల్ల మంచి కంటే నష్టమే ఎక్కువ. భూమిలో ఉన్న సేంద్రీయ కర్బనం, భూమి భౌతిక పరిస్థితి దెబ్బతినడమే కాక కాలుష్యం పెరుగుతుంది. భూమిలోనే పంట అవశేషాలను కలియదున్నితే సేంద్రీయ పదార్థం అందడమే కాక పంటలు ఆరోగ్యం పెరిగే అవకాశం ఉంటుంది.

– ఎస్.విజయచంద్ర, ఏడీఏ, కూసుమంచి

హక్కుల సాధనకు ఉద్యమించాలి


ఖమ్మంరూరల్: మాట్లాడుతున్న దండి సురేష్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకు యువత ఉద్యమించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సంఘ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా రామకృష్ణ, ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో సురేష్లు మాట్లాడారు. ప్రభుత్వాల తీరుతో చదువుకునేందుకు నాణ్యమైన విద్య అందడం లేదని, ప్రజలకు ఉచిత వైద్యం దొరకక ప్రణాలను కోల్పోతున్నారని, యువత ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమాజంలోని అసంఘటిత శక్తులను ఎదుర్కొనడం కోసం ఏఐవైఎఫ్ సంఘం ఏర్పడిందని, నాటి నుంచి దేహాన్ని అయినా ముక్కలు కానిస్తం కానీ దేశాన్ని ముక్కలుగా చేయనీయం అనే నినాదంతో ఏఐవైఎఫ్ అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు సాధించిన ఘనత మన సంఘానికే దక్కుతుందన్నారు. సమాజంలో జరుగుతున్న అరాచాకాలకు అడ్డుకట్ట వేసేలా ప్రస్తుత యువత ఆలోచనా ధోరణి మారాలని తెలిపారు. యువజన, ప్రజా సమస్యలపై సంఘటితంగా పోరాటాలు చేయాలని, పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాలు హామీని మరిచిందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి మామిళ్ల శ్రీనాథరెడ్డి, ఉపాధ్యక్షులు గనపారపు ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దోజు శ్రావణ్‌కుమార్, జిల్లా ఆఫీస్ బేరర్ ఉసికల రవి, వీరబాబు, విజయ్, రవి, చంద్రశేఖర్, కోటేష్, అజయ్, కిరణ్, రాము, సీపీఐ నాయకులు చెరుకుపల్లి భాస్కర్, పి.రామకృష్ణ, మామిండ్ల శ్రీనివాస్‌రెడ్డి, జి. ఉపేందర్, ఏర్పుల బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అన్నం ఫౌండేషన్‌లో అన్నదానం..


భోజనం వడ్డిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఏఐవైఎఫ్ 65వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యాన అన్నం శ్రీనివాసరావు ఫౌండేషన్‌లో అన్నదానం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శిపోటు ప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణలు పాల్గొని అనాథలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ.. యువజనులు సమస్యలపై పోరాటాలు చేస్తూనే, ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జానిమియా, పోటు కళావతి, నిర్మల, బోడా వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



సెల్ఫీ పాయింట్ వద్ద కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కేఎంసీ కమిషనర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, కేఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగి మాట్లాడారు. సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకొని సెల్ఫీ దిగి ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంపొదించాలని సూచించారు. సెల్ఫీ దిగిన తర్వాత కలెక్టర్‌కు సెల్ఫీ ట్యాగ్ చేయాలని తెలిపారు.

పేదలకు కనీస వసతులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: పేద ప్రజలకు కనీస వసతులు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని రామచంద్రయ్య ప్రాంతంలో పగిడిపల్లి నాగేశ్వరరావు ఇంటికి కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేద ప్రజలకు ఉన్న మీటర్లను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం సరైంది కాదన్నారు. వెంటనే కరెంట్ మీటర్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో హనుమంతరావు, రాంబాబు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భద్రూనాయక్, ఉపేంద్రబాయి, రేగళ్ల సీతారాములు, షేక్.నజీమా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 ప్రభుత్వ ఆస్పత్రి సబ్ స్టేషన్ నెహ్రూనగర్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-5 ఏఈ ఆపరేషన్స్ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వైరారోడ్, కిమ్స్ ఆస్పత్రి ప్రాంతం, బీకే బజార్, నిజాంపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే నగరంలోని 33/11 ఎన్ఎస్‌టీ రోడ్ సబ్ స్టేషన్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సరిత క్లినిక్ సెంటర్, బాలాజీనగర్, జెండాల సెంటర్, వైరారోడ్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏఈ ఆపరేషన్స్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈలు కోరారు.

పరామర్శ..

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు మద్దినేని రమేష్‌బాబు కుమారుడు పవన్‌కృష్ణ ఇటీవల చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే శుక్రవారం బాధిత కుటుంబాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకుడు రాంరెడ్డి శ్రీ చరణ్‌రెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధరావత్ అనురాధ, చల్లా మల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, శంకర్ నాయక్, బండి శ్రీరాములు తదితరులున్నారు.

తొలిరోజు 73 ఓట్లు పోలింగ్..

కూసుమంచి/ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగనుండగా వృద్ధులు, వికలాంగులకు ఎన్నికల కమిషన్ ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించింది. దీనిలో భాగంగా పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో కలిపి వయోవృద్ధులు, దివ్యాంగుల ఓట్లు 299 ఉండగా అందులో శుక్రవారం 73 మంది ఓటేశారు. ఇందులో 21 సీనియర్ సిటిజన్ ఉండగా, దివ్యాంగులు 52మంది ఓటు వేశారు.


కూసుమంచి: పోచారంలో ఇంటి వద్ద ఓటు వేస్తున్న వృద్ధుడు

‘ఉపాధి’ని రైతులకు అనుసంధానం చేయాలి


కామేపల్లి: ఎంపీడీఓకు వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

రఘునాథపాలెం/కామేపల్లి: ఉపాధి హామీ పనులను రైతులకు అనుసంధానం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా అనుబంధ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య, ఖమ్మం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈమేరకు శుక్రవారం రఘునాథపాలెం ఎంపీడీఓ అశోక్‌కు హనుమంతరావు మాట్లాడగా, కామేపల్లి మండలం కొమ్మినేపల్లిలోని ఉపాధి కూలీలతో మాట్లాడి ఎంపీడీఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేసిన సందర్భంగా వెంకయ్య మాట్లాడారు. పదేళ్ల పాటు పాలించిన కేంద్ర ప్రభుత్వంనేటికీ వ్యవసాయ కార్మికులకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించలేదని, నల్ల డబ్బులను బయటకు తీసి వ్యవసాయ కార్మికుల జీరో అకౌంట్‌లో రూ.15 లక్షలు అందజేస్తానన్న మోదీ మాయమాటలతో కాలయాపన చేశారన్నారు. ప్రభుత్వాలు, జెండాలు మారిన కార్మికుల బతుకులు మారడం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని కార్మికులందరూ సమష్టిగా ఓడించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గడ్డపారలు, బొచ్చెలు, పారలు తదితర సామగ్రి ఏర్పాటు చేయాలని, రోజుకు కూలి రూ.600 ఇవ్వడంతో పాటు 200 రోజులు పని దినాలు కల్పించాలని, పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఐపీకేఎంఎస్ ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు కూరాకుల నరసయ్య, కార్యదర్శి కేలోతు పాపారావు, చల్ల రాజు, శంకర్, ఎన్‌వీ.రాకేష్, గుగులోత్ తేజానాయక్, ఎర్రయ్య, సీతారాములు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి కష్టాలు..!

మండలంలోని కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లు మరమ్మతులకు గురి కావడంతో స్థానికులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న అంశంపై ‘తాగునీటి తంటాలు’అనే శీర్షికను ఇటీవల సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో జీపీ అధికారులు బొడ్రాయి సెంటర్, గ్రామ పంచాయతీ సమీపంలోని వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో తమ తాగునీటి కష్టం తీరిందని స్థానికులు తెలిపారు.

– కామేపల్లి


వినియోగంలోకి వచ్చిన బొడ్రాయి సెంటర్‌లోని వాటర్ ప్లాంట్

సాక్షి ఎఫెక్ట్..

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి


ఖమ్మంవన్‌టౌన్: మాట్లాడుతున్న రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ప్రజలకు సేవ చేయాలనే ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, అందరూ ఆదరించాలని సీపీఐ, సీపీఎం పార్టీలను బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం విస్‌ఫీల్డ్ స్కూల్ సమీపాన ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అంతా క్షేత్రస్థాయిలో పర్యటించి భారీ మెజార్టీ అందించాలని కోరారు. కాగా, నెహ్రూనగర్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ఇంటికి రఘురాంరెడ్డి వెళ్లి తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసాని లక్ష్మీనారాయణ, రాయల నాగేశ్వరరావు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, గుర్రం తిరుమలరావు, చావా నారాయణరావు, పుచ్చకాయల వీరభద్రం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

‘ఉపకారం చేసిన వారిని మరిచిపోం..’

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: ఉపకారం చేసిన వారిని మరిచిపోమని ఖమ్మం జిల్లా కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్మ కులంలోని అట్టడుగు పేదల అభివృద్ధికి అడిగిన వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందని పేర్కొంటూ తమ సంపూర్ణ మద్దతు రఘురాంరెడ్డికి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కమ్మ మహాజన సంఘం కోశాధికారి నల్లమోతు రఘు, ఈసీ సభ్యులు బండి మాధవరావు, కమ్మ సంఘాల ప్రతినిధులు కట్టా పూర్ణచందర్, చల్లగుండ్ల లోకేశ్వరరావు, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, నెల్లూరి వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే రఘురాంరెడ్డికి తమ పూర్తి మద్దతును ప్రకటిస్తున్నట్లు దైవ సేవకులు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం బాధ్యులు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వారు మద్దతు ఇవ్వగా.. పొంగులేటి ప్రసాదరెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని స్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ, ఎండీ ముస్తఫా పాల్గొన్నారు.

రఘురాంరెడ్డిని గెలిపించండి..

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు, సినీ హీరో వెంకటేష్ కూతురు ఆశ్రిత, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూతురు స్వప్నిరెడ్డి, ఆమె భర్త ప్రచారం నిర్వహించారు. అనంతరం నగరంలోని 6వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రఘురాంరెడ్డిని గెలిపిస్తే ఖమ్మంను మరింత అభివృద్ధిపథంలో నడిపిస్తారన్నారు. ఈ సమావేశంలో ఎస్ఆర్ డెవలపర్స్ అధినేత రాము తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యాన ప్రదర్శన..

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సీపీఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం గాంధీచౌక్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ దేశానికి ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపే శ్రీరామరక్ష అవుతుందని తెలిపారు. అలాగే మతోన్మాద బీజేపీని ఓడించి, ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ నాయకుడు, ఇన్సాఫ్ కమిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మొహమ్మద్ సలాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం నాయకుడు లింగాల రవికుమార్ అన్నారు. స్థానిక వాహిదియా మస్జీద్ వద్ద నిర్వహించిన ప్రచారంలో సలాం, ఖమ్మంలోని సమావేశంలో రవికుమార్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు భుక్యా శ్రీనివాస్‌రావు, యర్రా శ్రీనివాసరావు, తుశాకుల లింగయ్య, పత్తిపాక నాగసులోచన, యర్రా మల్లికార్జున్, అవాజ్ జిల్లా కార్యదర్శి గౌస్, ఎండీ రెహమాన్, ఎస్‌కె మీరా, అహ్మద్, ఎండీ మజీద్, పాముల దానయ్య, గంగాధర్, భాస్కర్, పాస్టర్ భాగ్యరాజ్ ,వినోద్, లూర్దు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

నామా గెలుపును కాంక్షిస్తూ ప్రచారం


ఇంటింటి ప్రచారం చేస్తున్న నామా తనయులు

ఖమ్మంరూరల్: ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహిచారు. ఈ సందర్భంగా కందాల మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు గతంలో చేసిన తప్పిదం చేయకుండా ఈఎన్నికల్లో నామాకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బెల్లం వేణు, బెల్లం ఉమా తదితులు పాల్గొన్నారు.

నామా తనయులు..

ఖమ్మంమయూరిసెంటర్: నామా నాగేశ్వరరావు గెలుపే లక్ష్యంగా ఆయన తనయులు పృథ్వీతేజ, భవ్యతేజ, సాయిరాం శుక్రవారం నగరంలోని 55వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. అలాగే, రైతుబజార్‌లో రైతులు, చిరువ్యాపారులను పలకరిస్తూ తమ తండ్రికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోతారపు సుధాకర్, మధు, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగరడం ఖాయం


ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు

తిరుమలాయపాలెం: పార్లమెంట్ ఎన్నికలలో ఖమ్మంలో కాషాయం జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో బీజేపీకి మంచి స్పందన వస్తుందని, తాండ్ర వినోద్‌రావు గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని అన్నారు. దేశం అభివృద్ధి కోరుకునే వారంతా బీజేపీకి ఓటు వేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్, ఇందూరి మహేష్, సంపత్, వివిధ పార్టీల నాయకులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.